TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 171 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.15.01.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## కాంతి లేని సంక్రాంతి



ఖమ్మం :అమృత్ తెలంగాణ: ”ఉత్తరాయణం మకర సంక్రమణం.. ప్రకృతి పులకించాలి.. పల్లె పరవశించాలి.. సంక్రాంతి కోలాహలంతో ఊళ్లు 'పెద్ద పండుగ' చేసుకోవాలి.. కానీ చీడపీడలు పాడి పంటలను ఛిద్రం చేశాయి. తుపానుల తాకిడికి పత్తి రైతు చిత్తయ్యాడు.. కపాస్ యాప్‌తో అరకొర పంట అంగట్లో సరుకైంది. గుబ్బ తెగులు గుబులు రేపుతుండగా.. మిరప రైతు కంట నీరు తిరుగుతోంది. ఎరువు కరువైంది. యూరియా యాప్ వెతలు వెంటాడుతున్నాయి.. సకాలంలో అందని పెట్టుబడి సాయంతో రైతుకు 'భరోసా' లేకుండా పోయింది. రంగుల వాకిళ్లే కానీ కర్షకుల జీవితం కళావిహీనంగా మారింది. బతుకంతా వ్యథలు నిండగా.. పేరుకే పెద్ద పండుగ”లా.. కాంతిలేని సంక్రాంతి తీరు ఉంది.”

విపత్తులో పత్తి రైతు

ఈ ఏడాది పత్తి పంట రైతులను చిత్తు చేసింది. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేసిన పైరు అధిక వర్షాలకు గిడసబారి కాయ పగిలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఎకరానికి 12 క్వింటాళ్లకు పైగా రావాల్సిన పత్తి తుపానుల తాకిడికి నాలుగు క్వింటాళ్ల లోపు మాత్రమే దిగుబడి వచ్చింది. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. పత్తి తీత దశలో వర్షాలు ఎడతెరిపి లేకుండా కురిశాయి. పూత, కాయలు మచ్చలు వచ్చి పాలిపోయాయి. కనీసం పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేక రైతులు పైరును తొలగించారు. నష్టాల్లో ఆదుకునే క్రాప్ ఇన్సూరెన్స్ సైతం ప్రభుత్వం తొలగించటంతో పత్తి రైతులు ఆవేదన చెందారు. గతంలో కంటే పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. ఎకరం పత్తి సాగు చేయాలంటే కౌలుతో కలిపి రూ.50 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. ఎకరం భూమి కౌలు ధర రూ.20 వేల వరకు ఉండగా, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు కలిపి మరో రూ.25 వేలు అవుతున్నాయి. ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చి రూ.12 వేలు ధర ఉంటేనే రైతుకు గిట్టుబాటు అయ్యేది. కానీ కపాస్ యాప్ పేరుతో సీసీఐ పెట్టిన నిబంధనల కారణంగా నాణ్యత లేమి సాకుతో క్వింటా రూ.6 వేల లోపు ధరకే రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది.

కపాస్ యాప్‌తో కష్టాలు

కపాస్ యాప్‌తో పత్తి రైతులు కష్టాలు ఎదుర్కొన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులు పత్తిని విక్రయించుకోవాలంటే ఆ యాప్‌లో రైతులే స్లాట్ బుక్ చేసుకోవాలి. ఒక కేంద్రం వద్ద రోజుకు 50 వాహనాల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. దీనివల్ల రైతులు రోజుల తరబడి యాప్‌లో వివరాలు నమోదు కాక ఇబ్బందులు పడ్డారు. రోజుకు ఒక మిల్లులో 50 వరకు వాహనాల్లోని పత్తినే కొనుగోలు చేస్తుండటంతో ఉదయం నుంచి మధ్యాహ్నంలోపే యాప్‌లో బుకింగ్స్ పూర్తయ్యాయి. ఆ తర్వాత యాప్‌లో నమోదు కాక, రైతులు అవస్థలు పడ్డారు. దాంతో రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని పలువురు రైతులు, వివిధ అవసరాల రీత్యా నిరీక్షించలేని వారు ప్రయివేటు వ్యాపారులకు క్వింటాలుకు రూ.5,500 నుంచి రూ.7,000 వరకు విక్రయించుకుని నష్టపోతున్నారు. అదే సీసీఐ ఆధ్వర్యంలో క్వింటాల్‌కు మద్దతు ధర రూ.8,116 ఇస్తున్నారు. రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. రైతుల వద్ద అరకొర ధరలకు కొనుగోలు చేసి, అదే రైతులు, లేదంటే తెలిసిన పేరుతో స్లాట్ బుక్ చేసుకొని క్వింటాల్‌కు రూ.వెయ్యి వరకూ లాభంతో జిన్నింగ్ మిల్లుల్లో విక్రయించారు.

గుబ్బ తెగులతో మిర్చి రైతుకు గుబులు

మిర్చిలో గుబ్బతెగులు (గుల్ల తెగులు) ఓ తీవ్ర సమస్యగా మారింది. దీనివల్ల మొక్కలు ఎండిపోయి, పంట నాశనమవుతోంది. ముఖ్యంగా నల్లతామర పురుగు, ఇతర తెగుళ్ళ వల్ల ఇది సంభవిస్తుందని సైంటిస్టులు చెబుతున్నారు. గుబ్బ తెగులు నివారణకు పురుగుమందులు, సేంద్రీయ పద్ధతులు పాటిస్తున్నా.. మూడు రోజులకోసారి పురుగు మందులు పిచికారీ చేస్తున్నా తెగుళ్లు నియంత్రణలోకి రావటం లేదని రైతాంగం వాపోతోంది. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి పెట్టి అర్ధాంతరంగా తోటలను తొలగించాల్సిన పరిస్థితి వస్తుందని అంటోంది. రాష్ట్రంలో ఈ తెగులు తీవ్రంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో శాస్త్రవేత్తలు పర్యటిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ తదితర మండలాల్లో శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఆకుల మీద, పువ్వులలో ఎక్కువ సంఖ్యలో నల్లి చేరి గోకి, రసం పీల్చడం వల్ల ఆకులు మాడిపోయినట్లుగా అవుతున్నాయి. ఆకుల పైభాగం పసుపు రంగుకు మారి, కింది భాగం ముదురు గోధుమ రంగులోకి మారుతుంది. పువ్వులను ఆశించి గోకటం వలన గోధుమరంగుకి మారి రాలిపోతున్నాయి. గోధుమ రంగుకి మారిన పువ్వులు ఎండిపోయి రాలిపోవడం వల్ల కాయలు సంఖ్య తగ్గుతోంది. పురుగులు కాయ దశలో ఆశించటం వలన కాయలు గిడసబారి, ఇటుక రంగులోకి మారుతున్నాయి. మిరప తోటలు గుబ్బ తెగులు కారణంగా పనికి రాకుండా పోతున్నాయి. దీనివల్ల ఒక్కో రైతు ఎకరానికి రూ.లక్షకు పైగా పెట్టుబడి నష్టపోయి పంటను వదిలేస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో ఒకప్పుడు 10 లక్షల ఎకరాల వరకూ సాగైన పంట ఇప్పుడు 2 లక్షల లోపు ఎకరాలకు మాత్రమే పరిమితమైంది.

యూరియా అందక ఆపసోపాలు

వానాకాలం సీజన్‌లో మాదిరిగానే అన్నదాతలకు యాసంగిలో కూడా యూరియా అవస్థలు తప్పటం లేదు. ఎరువు కొరత రాకుండా ప్రభుత్వం యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చినా సక్రమంగా అమలుకాక రైతులు పాట్లు పడుతున్నారు. రైతులు పీఏసీఎస్‌లు, దుకాణాల వద్ద పడిగాపులు కాయకుండా అవసరమైన మేరకే విడతల వారీగా తీసుకోవచ్చని వ్యవసాయాధికారులు ప్రత్యేక యాప్ రూపొందించి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. తొలుత ఈనెల 20 నుంచి రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించగా, తర్వాత అన్ని జిల్లాల్లో అమలు చేశారు. ఖమ్మం జిల్లాలో ఈనెల మొదట్లో అందుబాటులోకి వచ్చిన యాప్‌తో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మొదట్లో ఖమ్మం జిల్లాను ఫెర్టిలైజర్ యాప్‌లో చేర్చలేదని కొందరికి మెసేజ్ రావడం గమనార్హం. రైతుల ఆందోళనలతో దిగొచ్చిన అధికారులు పాస్‌బుక్ ఆధారంగా కూపన్లు జారీ చేస్తున్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భోగి పండుగ రోజు కూడా ఎరువుల పంపిణీ కేంద్రాల వద్ద రైతులు కిటకిటలాడటం గమనార్హం.

కోటిన్నర ఎకరాలకు అందించే అవకాశం

సంక్రాంతికి 'రైతు భరోసా' వస్తుందని ఆశించిన రైతాంగానికి నిరాశే మిగిలింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రెండు విడతలుగా రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున జమ చేసింది. 2024-25 యాసంగి సీజన్‌లో ఆలస్యంగా రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసినప్పటికీ, మొన్నటి వానాకాలం మాత్రం సరైన సమయంలోనే రైతు భరోసా అందించింది. ఈ నేపథ్యంలో ఈసారి కూడా రైతులకు పెట్టుబడికి అందేలా సంక్రాంతి నాటికే రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించినట్టు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. కానీ అదీ అమలు కాలేదు. గత వానాకాలం సీజన్లో 69.40 లక్షల మంది రైతులకు సంబంధించిన 145.73 లక్షల ఎకరాలకు రైతు భరోసా మొత్తాన్ని ప్రభుత్వం అందజేసింది. ఇందుకోసం మొత్తం రూ. 8,74 కోట్లు వెచ్చించింది. ఈసారి కూడా దాదాపు అంతే మొత్తంలోగానీ, ఆ సీజన్‌లో మిస్సయిన ఇతర రైతులందరికీ కలిపి కోటిన్నర ఎకరాలకు అందించే అవకాశం ఉందని అంటున్నారు. కానీ ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై స్పష్టత లేకుండా పోయింది.

'భరోసా' కల్పించేందుకు ప్రభుత్వం సమాయత్తం

ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు ఆశించిన మేర విజయాలు సాధించగా, కొత్త సంవత్సరం ప్రథమార్థంలో జిల్లా, మండల పరిషత్, మున్సిపల్ ఎన్నికలు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో రైతులకు యాసంగి రైతు భరోసాను 'పెట్టుబడి సాయం' కింద ముందుగానే అందజేయడం ద్వారా ప్రభుత్వం పట్ల సానుకూలత పెరుగుతుందని అంచనా వేసిన సీఎం రేవంత్‌రెడ్డి అందుకనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సమాయత్తం చేసినట్టు సమాచారం.

## 18న మేడారానికి సీఎం, మంత్రుల రాక



ములుగు :అమృత్ తెలంగాణ: ఈ నెల 18న సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు మేడారానికి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీశిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం మేడారం హరిత హోటల్‌లో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం చేరుకున్న అనంతరం అక్కడే బస చేయనున్నారని, 19న సమ్మక్క-సారలమ్మ గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం చేయనున్నట్టు తెలిపారు. 18న రాష్ట్రస్థాయి యంత్రాంగం మొత్తం మేడారంలోనే ఉండనున్నందున ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అధికారులకు సూచించారు. క 18న ఆదివారం కావడం, పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ముగియనుండటంతో సందర్శకుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని, ఆ దృష్టితో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మేడారం అభివృద్ధి పనుల్లో సహకరిస్తున్న జిల్లా అధికారులు, వారి బృందాలకు, జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు మంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రి రాక సందర్భంగా ముందుగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రొటోకాల్, బందోబస్తు, వసతి, సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హెలిప్యాడ్ నిర్వహణ పనులను ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించారు. మేడారం జాతరతోపాటు గద్దెల ప్రాంగణ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీఓను ఆదేశించారు. ముఖ్యమంత్రి, వీఐపీ ప్రొటోకాల్ బాధ్యతలను ఆర్డీఓ వెంకటేష్‌కు అప్పగించారు. బహిరంగ సభ నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా ధింసా, కోయ, గుస్సాడి, కొమ్ము కోయ తదితర సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రి భద్రత, రూట్‌మ్యాప్, పార్కింగ్, గార్డ్ ఆఫ్ ఆనర్ ఏర్పాట్లను ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ పర్యవేక్షించనున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో మంత్రి కొండా సురేఖ



ఐనవోలు :అమృత్ తెలంగాణ: భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి కొండ సురేఖకు, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. తదనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలనిసూచించారు. అదేవిధంగా ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన బస్ బస్టాండ్‌ను ప్రారంభించి.. బస్సులో మంత్రి, ఎమ్మెల్యే ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఐనవోలు ఆలయం సందర్శకుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందనిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, బ్రహ్మోత్సవాలు,జాతరలనిర్వహణకు అన్ని విధాలా సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడారు. భోగిపర్వదినం సందర్భంగా శ్రీ మల్లికార్జున స్వామిబ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం తనకు ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ మాజీ చైర్మెన్ మార్నేనీ రవీందర్‌రావు, ఆలయ కమిటీ చైర్మెన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మహిళలపై దుష్ప్రచారం చేసేవారు చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందే : వీసీ సజ్జనార్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మహిళల వ్యక్తిత్వంపై దాడి చేయడం క్రూరత్వమని, వారి గురించి దుష్ప్రచారం చేయడం నేరమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అన్నారు. వీసీ సజ్జనార్ తాజాగా మాట్లాడుతూా. మహిళల వ్యక్తిత్వంపై దాడి చేయడం క్రూరత్వమని, వారి గురించి దుష్ప్రచారం చేయడం నేరమన్నారు. మహిళలపై దుష్ప్రచారం, దాడులు చేయడమంటే వారి పురోగతిని అడ్డుకోవడమేనని అన్నారు. మహిళలపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేసేవారు చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందేనని హెచ్చరించారు.

సీపీ సజ్జనార్ ట్వీట్ వైరల్

ప్రజా జీవితంలో విమర్శలు సహజమేనని. రాజకీయాలైనా, సామాజిక అంశాలైనా భిన్నాభిప్రాయాలు ఉండటం ప్రజాస్వామ్య లక్షణం అన్నారు సజ్జనారొ కానీ మహిళలపై వ్యక్తిగత దాడులు చేయడం, వారి చరిత్రను కించపరచడం, అసభ్య వ్యాఖ్యలు చేయడం విమర్శలు అనిపించుకోవు అని అన్నారు. అలాంటి చర్యలు కేవలం క్రూరత్వం మాత్రమేనని, మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం చేయడం అత్యంత ఆందోళనకరమైన విషయం అన్నారు. వారిని వ్యక్తిగతంగా దెబ్బతీయడం, ప్రతిష్ఠను నాశనం చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సజ్జనార్ పేర్కొన్నారు.

మహిళా శక్తి -- అపరిమితమైన గౌరవం

ఒక మహిళ ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, లేదా గృహిణి అయినా.. ఆమెకు అపరిమితమైన గౌరవం ఇవ్వాలి. నేటి మహిళ అన్ని రంగాల్లో ముందువరుసలో ఉండి నాయకత్వం వహిస్తోంది. పాలనలో, పోలీసు శాఖలో, శాస్త్ర సాంకేతిక రంగంలో, మీడియా రంగం సహా పలు రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒకవైపు ఇంటి పనులు, మరోవైపు ఉద్యోగం చేయడరొ ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ఎన్నో కనిపించని బాధ్యతలను భుజాన వేసుకుని మహిళలు కుటుంబాన్ని, సమాజాన్ని ముందుకు తీసుకెళుతున్నారని చెప్పారు. ఇలాంటి మహిళలపై దాడులు చేయడం అంటే సమాజ ప్రగతిపై దాడి చేయడమేనని సజ్జనార్ అన్నారు.


భారతీయ సంస్కృతి, సామాజిక బాధ్యత

మన భారత సాంప్రదాయం ఎప్పుడూ ఒకే సందేశాన్ని ఇస్తుందని.. ”యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత్ణా” (ఎక్కడ మహిళలు పూజింపబడతారో, అక్కడ దేవతలు కొలువై ఉంటారు) అని సజ్జనార్ తన ట్వీట్లో గుర్తు చేశారు. మహిళలకు గౌరవం ఉన్న చోటే సుభిక్షంగా ఉంటుంది. కానీ దురదృష్టవశాత్తు నేడు టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, కథనాల పేరుతో మహిళలపై జరుగుతున్న దూషణలు అసహ్యకరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను గౌరవించని సమాజం తన భవిష్యత్తును కోల్పోతుందని, దేశాన్ని ముందుండి నడిపిస్తున్న మహిళలను కించపరచడం దేశానికే పెద్ద నష్టం అని హెచ్చరించారు.

ఇక సహించబోము

మహిళలపై జరుగుతున్న అవమానం, వివక్ష, చరిత్ర హననాన్ని ఇకపై ఎంతమాత్రం సహించబోం అని సజ్జనార్ స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఇక సామాజిక మాధ్యమాల్లో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించేవారు, మహిళలపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేసేవారు చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందే అన్నారు. భవిష్యత్తు మహిళలదే అని, ఆ భవిష్యత్తు పరస్పర గౌరవంతోనే నిర్మితమవుతుంది కానీ, అవమానాలతో కాదు అని సజ్జనార్ సూచించారు.

## కాంగ్రెస్ పార్టీకి షాక్..బీఆర్ఎస్‌లో చేరిన నేతలు




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. బాపునగర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు. ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ గూటికి చేరారు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ది వారికి పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకే పలువురు తమ పార్టీలో చేరుతున్నారని అన్నారు.

# అసైన్డ్ భూములపై నకిలీ పత్రాలతో మోసం -- ప్రధాన నిందితులలో ఒకరీ నిందితుడు అరెస్ట్

ఈ కేసులో పరారీలో ఉన్న నిందితులపై గాలింపు ప్రక్రియ.

మావల సీఐ కర్ర స్వామి

శాఖలో ఉన్న లోసుగుల ఆధారంగా, రెవెన్యూ శాఖలో కాంటాక్ట్ ఉద్యోగ పనిచేసి, అసైన్డ్ భూమికి కబ్జా ప్రయత్నం చేసిన నిందితుడు.

నిందితుడు

ధారావత్ ప్రవీణ్, (ఒకప్పటి తాసిల్దార్ కార్యాలయంలో కాంట్రాక్టు టైపిస్టు)

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి మావల గ్రామ పరిధిలోని సర్వే నెం. 181/8 లో ఉన్న ప్రభుత్వ (అసైన్డ్) భూమిని నకిలీ పత్రాలతో తమదని చూపించి మోసం చేసిన ఘటనలో ఒక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు మావల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి సెతి రమాదేవి (67) ఫిర్యాదు మేరకు నమోదు చేయబడింది. ఆమెకు చెందిన సుమారు 3 ఎకరాల భూమిలో కొంతమంది అక్రమంగా చొరబడి భయభ్రాంతులకు గురి చేస్తూ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు విచారణలో, నిందితులు ఈ భూమి ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ (సర్కారీ/పోరంబోకు) భూమి అయినప్పటికీ, నకిలీ పత్రాలు తయారు చేసి జీపీఏలు, అమ్మకపు ఒప్పందాలు నమోదు చేసి ప్రజలను మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమిని చిన్న చిన్న ప్లాట్లుగా చూపిస్తూ ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు తేలింది. ప్రధాన నిందితుల్లో ఒకరైన దరవత్ ప్రవీణ్ కుమార్ (A2) గతంలో తహసీల్దార్ కార్యాలయంలో కాంట్రాక్ట్ టైపిస్టుగా పని చేయడంతో రెవెన్యూ ప్రక్రియలపై అవగాహన కలిగి ఉండి ఈ మోసానికి పాల్పడ్డట్లు విచారణలో వెల్లడైంది. జనవరి 13, 2026 నాడు ప్రత్యేక పోలీసు బృందం హైదరాబాద్ లోని పోచారం ప్రాంతంలో అతడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించారు. అతని వద్ద నుంచి ఒక ఆపిల్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని, అందులో నకిలీ పత్రాలకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు గుర్తించారు. ఈ కేసులో మరో నిందితుడు దుర్వ నాగేశ్ (A1) ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. మిగిలిన 10 మంది పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితులపై చీటింగ్, నకిలీ పత్రాల తయారీ, నకిలీ పత్రాల వినియోగం, అక్రమ ప్రవేశం వంటి కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ప్రజలు ఎవరైనా భూములు కొనుగోలు చేసే ముందు, ఆ భూమి అసైన్డ్ భూమి కాదా అని రెవెన్యూ రికార్డులు తప్పకుండా పరిశీలించాలని మావల పోలీసులు సూచించారు. ప్రభుత్వ భూములపై నకిలీ పత్రాలు తయారు చేస్తే లేదా అక్రమంగా




ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జందాపూర్ గ్రామం మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడిగా పసుల పోశెట్టి




మున్నూరు కాపు జందాపూర్ గ్రామ సంఘ అధ్యక్షుడు ని పసుల పోశెట్టి సన్మానిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : అదిలాబాద్ గ్రామీణ మండలంలోని జందాపూర్ గ్రామం మున్నూరు కాపు సంఘం ఎన్నికలు ఏకేగ్రహంగా జరిగినాయి ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా చిలుకూరు కిష్టన్న ప్రధాన కార్యదర్శిగా ఉష మొల్ల హరిబాబు కోశాధికారిగా చిలుకూరి శ్రీనివాస్ యువజన కమిటీ అధ్యక్షుడిగా కుందన ప్రవీణ్ ప్రధాన కార్యదర్శిగా చైతన్య జందాపూర్ గ్రామాల్లో ఉన్నటువంటి మున్నూరుకాపు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది పసుల పోశెట్టి నూతన అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం నా సాయి శక్తుల పనిచేస్తానని ఆయన తెలిపారు

ఈ కార్యక్రమంలో ఎలక్షన్ ఆఫీసర్ గా మాజీ టీఎన్జీవో అధ్యక్షుడు అశోక్ వ్యవహరించారు మాజీ జందాపూర్ గ్రామ సర్పంచ్ పసుల గంగాధర్ మరియు మున్నూరుకాపు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# పట్టణంలో మత్తు పదార్థాలపై నార్కోటిక్ జాగిలంతో ప్రత్యేక తనిఖీలు





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలం "రోమా"తో కలిసి మత్తు పదార్థాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీల్లో భాగంగా శాంతినగర్, బొక్కలగూడ కల్లు కాంపౌండ్లు, గౌరమ్మబట్టి, కుమ్మరివాడ ప్రాంతాల్లో గంజాయి తదితర మాదకద్రవ్యాల కోసం తనిఖీ చేపట్టారు. అదేవిధంగా గాంధీ పార్క్, ఏరోడ్రం ప్రాంతం, సత్నాల బస్టాండ్ పరిసరాలు మరియు హోటళ్లలో కూడా మత్తు పదార్థాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ప్రజల భద్రత కోసం ఇలాంటి తనిఖీలు కొనసాగించనున్నట్లు పోలీసులు తెలిపారు

# నాగోబా జాతర సందర్భంగా జనవరి 22న విద్యాసంస్థలకు సెలవు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో నిర్వహించే చారిత్రాత్మక నాగోబా జాతర ప్రజా దర్బార్‌ను పురస్కరించుకుని, జనవరి 22, 2026 (గురువారం) రోజున జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివాసీల ఆరాధ్యదైవం, ఆసియాలోనే రెండవ అతిపెద్ద గిరిజన జాతర సందర్భంగా,?మెస్రం వంశీయుల విజ్ఞప్తి మేరకు, జాతర విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జనవరి 22, 2026 (గురువారం) రోజున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు సెలవు



ఉంటుందనీ, ఈ సెలవుకు బదులుగా, 14.03.2026 (మార్చి రెండవ శనివారం) రోజున జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు పని చేయాల్సి ఉంటుందనీ సూచించారు.

# రాజురా లో ఘనంగా ముగ్గుల పోటీలు

సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆనందాలతో మొదలైన సంక్రాంతి పండుగ వేడుకలు

విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఎల్లప్పుడూ ఇలాగే కలిసికట్టుగా ఉండాలి





అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ : నెరడిగొండ మండలంలోని రాజుర గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొగ్గుల పోటీలు ముగిశాయి. గ్రామంలోని యువతిలు, చిన్నారులు ఎంతో సంతోషంగా పాల్గొని అందమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. ముగ్గులు పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మొదటి బహుమతి రాథోడ్ శ్రీ ప్రియ, రెండవ బహుమతి మధుమిత, మూడవ బహుమతి రాధికలకు కుటుంబ సమేతంగా కలిసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ గ్రామమంతా కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలని, ఎంతో చక్కగా యువతులు ముగ్గుల పోటీల్లో హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాదవ్ గణేష్, సర్పంచులు సరోజి, జాదవ్ సునీత రమేష్, సవాయి



సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు అనిల్ జాదవ్

రాం, జాదవ్ ధన్ రాజ్, రాహుల్ తదితరులు ఉన్నారు

# మంత్రి జూపల్లి కృష్ణారావు గారిని కలిసిన కంది శ్రీనివాస రెడ్డి

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : ఈ నెల 16న సీయం నిర్మల్ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక శాఖ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి బుధవారం నిర్మల్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆదిలాబాద్ నియోజక వర్గ విషయాలతో పాటు సీయం ఆదిలాబాద్ నిర్మల్ జిల్లా పర్యటన విషయాలు జనసమీకరణపై చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమయ్యేలా దిశానిర్దేశం చేసారు



# చైనా మాంజా విక్రయిస్తున్న ఒకరిపై కేసు.

8000 విలువగల చైనా మాంజా స్వాధీనం.

ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు.

టూ టౌన్ ఇన్చార్జి సీఐ బి సునీల్ కుమార్.



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : చైనా మాంజా విక్రయిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్చార్జ్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాంసి బస్టాండ్ ఏరియా వద్ద అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి వద్ద దాదాపు 8,000 విలువచేసే రెండు చైనా మంజ చరకాలు, 14 ప్యాకెట్ల చైనా మాంజ లభ్యమైనట్టు అతనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. చైనా మాంజ వల్ల పక్షులకు ప్రజలకు ప్రాణహాని గాయాలపాలయే అవకాశాలు ఉన్నందున ప్రజలు చైనామంజను వినియోగించవద్దని సూచించారు.

# కొంపల్లిలో వాలీబాల్ పోటీల ప్రారంభించిన ఎస్సై రవి

మునుగోడు: అమృత్ తెలంగాణ: మండలంలో కొంపల్లి గ్రామంలో ప్రతి పండుగఅబశ్రీశ్రీకు క్రీడలను నిర్వహించడం అభినందనీయమని ఎస్సై ఇరుగు రవి అన్నారు. బుధవారం కొంపల్లిలో సంక్రాంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నామోజు రత్నాచారి సహకారంతో నిర్వహించిన వాలీబాల్ పోటీల ప్రారంభోత్సవానికి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని యువత మండల, జిల్లాస్థాయిలో నిర్వహించే ప్రతి పోటీలో పాల్గొనే విధంగా ముందుకు గఅబశ్రీశ్రీర్వఅబశ్రీశ్రీకారణఅబశ్రీశ్రీమఅబశ్రీశ్రీన్నారు. క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సైకి, క్రీడలకు సహకరించిన రత్నాచారికి యువకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు జాల వెంకన్న యాదవ్, బోయపర్తి లింగయ్య, గ్రామస్తులు మక్కెన అప్పారావు, జాల నాగరాజ్, మక్కెన అశోక్, డోకూరి శ్రీనివాస్ రెడ్డి, ఎం యాదయ్య, మొగుదాల శంభు, జాల మనీ, వడ్డేపల్లి శంకర్, బోయపర్తి సైదులు, బోయపర్తి సంజీవ, చింతల శ్రీను, నరేందర్, బొల్లెపల్లి వెంకన్న, స్వామి తదితరులున్నారు.

# అన్నపూర్ణ అయ్యప్ప క్షేత్రం లో ఘనంగా మకరజ్యోతి దర్శన వేడుకలు

## అభిషేక పూజలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



అయ్యప్ప స్వామి వారికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



పాల్గొన్న భక్తులు

నిర్మల్ జిల్లా భైంసా జనవరి 14 అమృత్ తెలంగాణ భైంసా పట్టణం లోని అన్నపూర్ణ అయ్యప్ప క్షేత్రం లో మకర జ్యోతి దర్శన వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. లిఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్,స్వామి వారికి అభిషేకం చేశారు.. స్వాముల పాటలతో అశేష జనం మధ్య ఆలయ పరిసర ప్రాంతం అయ్యప్ప నామ స్మరణ తో మారుమోగింది. ఇచ్చిన మాట ప్రకారం ఆలయానికి సి. సి రోడు నిర్మాణం చేపట్టినందుకు ఎమ్మెల్యే కు ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి సాయినాథ్ కృతజ్ఞతలు తెలిపారు..అదే విధంగా ఆలయం లో మకర జ్యోతి ని దర్శించుకోవడం తో శబరి మలై లో జ్యోతి దర్శనాన్ని భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా విక్షించారు.

# సంక్రాంతి సంబరాల్లో మేడిపల్లి యువకులు క్రికెట్ టోర్నమెంట్



మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 14: మెట్‌పల్లి మండలం, మూడుబొమ్మల మేడిపల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలోని అన్ని యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఐదు జట్లతో క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ యువకులు ఘనంగా ఏర్పాటు చేశారు. సంక్రాంతి సంబరాల క్రికెట్ టోర్నమెంట్ల పేరిట జరిగిన ఈ పోటీల్లో యువకులు భారీ సంఖ్యలో పాల్గొని, ఉత్సాహంగా పోటీపడ్డారు.గ్రామ యువకులు కలిసి ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడం ద్వారా సంక్రాంతి సంబరాలు మరింత ఆకర్షణీయంగా మారాయి. పోటీలు ముగింపులో విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఈ టోర్నీ గ్రామంలో ఐక్యత, యువత ఉత్సాహాన్ని పెంచుతూ, పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన

## సదర్మాట్ బ్యారేజీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు





మంత్రికి మ్యాపు గురించి తెలియజేస్తున్న నీటిపాదుల శాఖ అధికారులు



సదర్ మటన్ బ్యారేజ్ ని పరిశీలిస్తున్న జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈనెల 16న నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా ప్రజల దశాబ్దాల కల, ప్రతిష్టాత్మక సదర్మాట్ బ్యారేజీని ముఖ్యమంత్రి జాతికి అంకితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కలిసి బ్యారేజీ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్ నిర్మాణం, ప్రారంభోత్సవ వేదిక, భద్రతా ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు. బ్యారేజీ గేట్ల పనితీరును స్వయంగా పరిశీలించిన మంత్రి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీతో ఈ ప్రాంత రైతాంగ కల సాకారం కాబోతోంది. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని పండుగ వాతావరణంలో, అత్యంత అట్టహాసంగా నిర్వహించాలి. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా వ్యవసాయ రంగానికి ఈ బ్యారేజీ వెన్నెముకగా నిలుస్తుందని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ రఘు



మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 14; వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులుగా మెట్ పల్లి నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు నియామకం అయినట్లు జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరుమండ్ల మహేష్ బుధవారం తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడ అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి, అదేవిధంగా జిల్లాలో యువ క్రీడాకారులను మరింత ప్రోత్సహించడానికి డాక్టర్ రఘు కృషి చేస్తారని పేర్కొంటూ ఈ నియామకం జరిపినట్లు తెలిపారు. జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడను మరింత ప్రోత్సహించడానికి డాక్టర్ రఘు చిట్నేని సలహాలను, సూచనలను పాటిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ రఘు నియామకం పట్ల అసోసియేషన్ సభ్యులు, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. కాగా నూతనంగా జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ రఘు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన నియామకం పట్ల సహకరించిన అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి బహిరంగ సభకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

## రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి (జిల్లా ఇన్‌చార్జి మంత్రి) జూపల్లి కృష్ణారావు





పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి బహిరంగ సభకు అవసరమైన ఏర్పాట్లను కట్టుదిట్టంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి (జిల్లా ఇన్‌చార్జి మంత్రి) జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి జిల్లాపర్యటన నేపథ్యంలో బుధవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లను మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టిన ఏర్పాట్ల వివరాలను కలెక్టర్ మంత్రికి వివరించారు. సభ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అంతకుముందు, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పట్టణానికి చేరుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిలకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అటవీ శాఖ అతిథి గృహంలో పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మంత్రికి, ప్రభుత్వ సలహాదారుకు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ సాయికిరణ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వసంత పంచమి సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ను ఆహ్వానించిన బాసర ఆలయ వేద పండితులు




అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి బాసరలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం రోజున వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ వేద పండితులు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వసంత పంచమి రోజున పెద్ద సంఖ్యలో బాసర ఆలయానికి భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతి భద్రతలు సజావుగా ఉండేందుకు ఆలయ పరిసరాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీని కోరారు. దీనికి స్పందించిన జిల్లా ఎస్పీ, భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ నిర్వహణ, సీసీటీవీ పర్యవేక్షణతో పాటు తగిన సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడతామని హామీ ఇచ్చారు.

# ఈ నెల 16న నిర్మల్ జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి రాక

## సభా ప్రాంగణం, సదర్ మార్ట్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఆత్రం సుగుణక్క



మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడుతున్న ఆత్రం సుగుణక్క

అమృత్ తెలంగాణ కొమరం భీం ఆసిఫాబాద్ న్యూస్ నిర్మల్: ఈ నెల 16వ తేదీన నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని సభా ప్రాంగణం, అలాగే పొన్కల్ గ్రామంలో గోదావరి నదిపై నిర్మించిన సదర్ మార్ట్ బ్యారేజ్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీహరి రావు,కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొన్కల్ గ్రామంలో గోదావరి నదిపై నిర్మించిన సదర్ మార్ట్ బ్యారేజ్‌ను ప్రారంభించి, అనంతరం నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని వారు తెలిపారు.అనంతరం సభా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష జరిపారు. సీఎం సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపురంలో భోగి మంటలు..



భువనగిరి :అమృత్ తెలంగాణ: భువనగిరి మండలంలోని బిఎన్ తిమ్మాపురం గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి మంటలను వెలిగించి, గ్రామస్థులు చిన్నలు పెద్దలు ఘనంగా సంక్రాంతి సంబరాలను చేసుకున్నారు.ఈ సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు రావుల నాగరాజు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే ఇది పూర్తిగా గ్రామీణ పండుగ అని గ్రామంలో ముగ్గులు పోటీలను ఏర్పాటు చేసుకుని ఆనందోత్సాహాలతో జరుపుకునే సంతోషకరమైన పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల కొండల్ రెడ్డి, వళ్ళందస్ పరమేష్,నకిరేకంటి జనార్ధన్,పిన్నం ఉప్పలయ్య,రావుల మహిపాల్,విగ్నేష్, ఉపేందర్,రాజశేఖర్ శ్రీను,నర్సింహ,నరేష్, మెడబోయిన రాజు,పాల్గొన్నారు

# బీజేపీ కి ఓటు వేస్తేనే సమస్యల పరిష్కారం

## కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేయని పని చేసి చూపించాం
## స్లాటర్ హౌస్ తొలగింపులో ఎమ్మెల్యే పాయల్ శంకర్





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : బీజేపీ కి ఓటేస్తే నే సమస్యలు పరిష్కారం అవుతాయని, ప్రజలకు మంచి జరుగుతోందని చెప్పడానికి ఆదిలాబాద్ లో పలు సమస్యల పరిష్కారామే ఉదాహరణలు అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆదిలాబాద్ ప్రజలు ఎదురు చూస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్, అండర్ బ్రిడ్జి నిర్మాణం, పట్టణంలో తోపుడు బండ్ల తొలగింపుతో పాటు కచ్ కంటి గ్రామానికి కి వెళ్లే దారిలో ఉన్న స్లాటర్ హౌస్ తొలగింపు కార్యక్రమాలే దీనికి నిదర్శనమని అన్నారు. ఆదిలాబాద్ పట్టణ ప్రజలు గత కొన్నేళ్లుగా స్లాటర్ హౌస్ దుర్వాసన తో ఇబ్బంది పడుతున్న సమస్య పరిష్కారానికి బుధవారం స్లాటర్ హౌస్ తొలగింపు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దగ్గరుండి పెట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర మాట్లాడుతూ...

గత 30 ఏళ్లుగా స్లాటర్ హౌస్ తొలగింపు కోసం గతంలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే లను, మున్సిపల్ చైర్మన్ లను స్థానిక ప్రజలు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కానీ బీజేపీ ఎమ్మెల్యే ను గెలిపించినందుకు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ స్లాటర్ హౌస్ తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఈ సమస్యకు పరిష్కార మార్గం చూపెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు దయాకర్ .చారి. రాము. ధోని జ్యోతి. నరేష్ . కృష్ణ .మున్సిపల్ అధికారులు ఉన్నారు

# మకర జ్యోతి దర్శనం మహాభాగ్యం
## అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు





స్వామి కి పూజలు చేస్తున్న శాసనసభ్యులు పాయల శంకర్ దంపతులు

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : శ్రీ అయ్యప్ప స్వామి సాక్షాత్ మకర జ్యోతి రూపంలో దర్శనం ఇవ్వడం, ఆ మకర జ్యోతిని మనం దర్శించుకోవడం మహా భాగ్యమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. అయ్యప్ప దీక్ష భక్తుల కోసం దర్శనమిచ్చే మకర జ్యోతి దర్శనాన్ని అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బుధవారం తిలకించారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్ లో శబరిమలలో దర్శనమిచ్చే మకర జ్యోతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష అంటే ఎంతో కఠోరమైన దీక్ష అని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి కరుణ కటాక్షాలు ప్రజలపై ఉండాలని వేడుకున్నామన్నార

# వెల్దండలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు..



వెల్దండ : అమృత్ తెలంగాణ: వెల్దండ మండల కేంద్రం లో మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన సందర్భంగా వెల్దండ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దండ బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్ ను ఉప్పల వెంకటేష్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అలాగే మండల కేంద్రంలో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీలలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల వెంకటేష్ జన్మదిన, సంక్రాంతి పండగ పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన మహిళలకు నగదు బహుమతితో పాటు చీరలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు రమేష్ గౌడ్, కొండల్ యాదవ్, మహిపాల్ నాయక్, నాయకులు పూరి రమేష్, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, అశోక్, జంగిరి యాదగిరి , మాజీ సర్పంచ్ శ్రీను నాయక్ , హనుమంతు నాయక్ తదితరులు ఉన్నారు.

# గెలుపు ఓటమి సమానంగా తీసుకోవాలి: సర్పంచ్




మిడ్జిల్ :అమృత్ తెలంగాణ: క్రీడాకారులు ఎప్పుడైనా గెలుపు, ఓటమి సమానంగా తీసుకోవాలని ఓడిపోతే కృంగిపోవద్దు, గెలుపొందితే పొంగిపోవద్దని నేడు ఓటమి రేపు గెలుపుకు నాంది పలుకుతుందని క్రీడాకారులు గ్రహించాలని సర్పంచ్ రాజు నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద గుండ్ల తండాలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ఉప సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ తో కలిసి విజేతలకు రూ.3000/-, బహుమతులు మాజీ వార్డు మెంబర్ మెగావాత్ శంకర్ నాయక్, టోపీ బహుమతులు ఆంగోత్ స్వప్న హనుమంతులు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంగోత్ వశ్య నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమార్ నాయక్, మెగా శ్రీను నాయక్, మేఘావత్ రమేష్ నాయక్, వడితే ఆవత్ శంకర్ నాయక్, మెగావాత్ శంకర్ నాయక్, తండా ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్వాట్ డేనియల్ లవర్ ఇంతందంగానా?



2021లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్లాక్ బస్టర్ హిట్ 'భీమ్లా నాయక్'తో టాలీవుడ్ లో అడుగుపెట్టింది సంయుక్త మీనన్. ఇందులో ఆమె రానా దగ్గుబాటి సరసన కథానాయికగా నటించింది. అందానికి అందం నటప్రతిభ ఉన్న నాయికగా పేరు తెచ్చుకుంది. డేనియల్ (రానా) వైఫ్ పాత్రలో డైనమిక్ నటనకు ప్రశంసలు అందుకుంది. 2022లో పృథ్వీరాజ్ 'కడువ'తో బ్లాక్ బస్టర్ ని అందుకుంది. ఇప్పుడు ధనుష్ ద్విభాషా చిత్రం వాతి .. కళ్యాణ్ రామ్ పాన్ ఇండియా మూవీ 'బింబిసార'.. కన్నడలో గాలిపాట 2 చిత్రాల్లో నటిస్తోంది. కెరీర్ పరంగా క్షణం తీరిక లేనంత బిజీ అయిపోయింది సంయుక్త. 2016లో పాప్ కార్న్ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన సంయుక్త సూపర్ హిట్ చిత్రం 'తీవండి'లో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. 2021లో వెల్లం-ఆనుమ్ పెన్నుమ్ చిత్రాలతో నెమ్మదిగా నిలదొక్కుకుంది. సంయుక్త కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ ఉత్తమ నటి అవార్డును అందుకుంది. భీమ్లా నాయక్ - కడువ లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాలు తనని గోల్డెన్ లెగ్ గా మార్చాయనడంలో సందేహం లేదు. సంయుక్తకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ఇక ఇదే అదనుగా ఈ బ్యూటీ కూడా సోషల్ మీడియాల్లో వరుస ఫోటోషూట్లతో అదరగొడుతోంది.

# కేతిక రాంగ్ టైమ్ లో అడుగుపెట్టిందా?



కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. పూరీ జగన్నాథ్ కొడుకు పూరీ ఆకాష్ హీరోగా నటించిన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కేతిక శర్మ ఆ సినిమా డిజాస్టర్ గా నిలవడంతో పెద్దగా హైప్ తెచ్చుకోలేకపోయింది. కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. ఇవన్నీ చూస్తుంటే కేతిక ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన టైమ్ కరెక్ట్ కాదనిపిస్తోంది. నాలుగేళ్లుగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఒక్కటి కూడా సక్సెస్ ఇవ్వకపోవడమేంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఆఖరికి కేతిక రీసెంట్ గా రాబిన్‌హుడ్ సినిమాలో చేసిన ఐటెమ్ సాంగ్ కూడా ఆమెకు కోరుకున్న సక్సెస్ ను ఇచ్చి, తన కెరీర్ కు బ్రేక్ ఇవ్వలేకపోయింది. రొమాంటిక్ సినిమా తర్వాత కేతిక, నాగశౌర్యతో కలిసి చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్ తో కలిసి చేసిన రంగ రంగ వైభవంగా కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్లుగా నిలిచాయి. దీంతో తన ఆశలన్నీ ఆమె కెరీర్లోనే నటించిన బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ అయిన బ్రో సినిమాపై పెట్టుకుంటే ఆ సినిమా కూడా తన ఆశలపై నీళ్లు చల్లుతూ బాక్సాఫీస్ వద్ద ఫెయిలైంది. బ్రో సినిమా తర్వాత టాలీవుడ్ దర్శకనిర్మాతలు కేతికను పట్టించుకోవడం మానేశారు. హీరోయిన్ గా పాత్రలు తగ్గిపోవడంతో కేతిక రాబిన్‌హుడ్ లో ఐటెమ్ సాంగ్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఆ సాంగ్ చేసింది. ఆ సాంగ్ లోని కేతిక బోల్డ్ మూవ్స్ సోషల్ మీడియాలో కాంట్రవర్సీ అయినప్పటికీ, ఆ సెన్సేషనల్ సాంగ్ కూడా అమ్మడి కెరీర్ కు ఏ మాత్రం ఉపయోగపడలేకపోయింది.

# ఇస్మార్ట్ బ్యూటీ సినిమా కష్టాలు..!



నన్ను దోచుకుందువటే సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. హీరోయిన్ గా మొదటి సినిమాతోనే మంచి మార్కులు దక్కించుకుంది. సుధీర్ బాబు కు జోడీగా ఆ సినిమా లో నటించిన నభా నటిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడం తో పాటు పెద్దల యొక్క చూపు పడేలా చేసింది. ఆ సినిమా తర్వాత బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చాయి. అనూహ్యంగా నభా నటేష్ యొక్క ప్రతిభ గుర్తించిన డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ ఏకంగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ ఇచ్చాడు. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడం మాత్రమే కాకుండా ఇస్మార్ట్ పోరీగా నభా నటించిన తీరు అందరిని ఆకట్టుకుంది. హీరోయిన్ గా ఆ సినిమా తో కమర్షియల్ హీరోయిన్ గా ఈ అమ్మడు నిలదొక్కు కోవడం ఖాయం అనుకుంటూ ఉండగా అనూహ్యంగా ఈ అమ్మడి కెరీర్ కు కరోనా కష్టం వచ్చి పడింది. వరుసగా సినిమాల్లో ఆఫర్లు వస్తాయని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా కరోనా వల్ల మొత్తం సీన్ రివర్స్ అయ్యింది. కాస్త గ్యాప్ రావడంతో ఈ అమ్మడిని జనాలు మాత్రమే కాకుండా సినీ వర్గాల వారు కూడా పక్కన పెట్టేసినట్లుగా ఉన్నారు. అందుకే ఈమధ్య కాలంలో ఈ అమ్మడు కనీసం ఒక్కటి రెండు చిన్నా చితకా ఆఫర్లను కూడా దక్కించుకోలేక పోతుంది అల్లుడు అదుర్స్ మరియు మాస్ట్రో సినిమాల్లో నటించిన ఈ అమ్మడు కమర్షియల్ గా మళ్లీ బ్రేక్ ను దక్కించుకోలేక పోయింది

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ఈ లుక్ కోసం 10ఏళ్లు శ్రమించిన సింగర్



ఇటీవలి కాలంలో గాయనీగాయకులు కూడా ఫిట్ నెస్ ఫ్రీక్ లు గా మారుతున్నారు. అందాల కథానాయికలకు ధీటుగా తమదైన గ్లామర్ తో ఓలలాడిస్తున్నారు. హీరోయిన్లతో పోలిస్తే టూ హాట్ గా కనిపించే గాయనీమణులకు కొదవేమీ లేదు. ఇక పాప్ గాయనిగా పాపులరైన నేహాభాసిన్ పరిచయం అవసరం లేదు. జగ్ ఘూమేయా (సుల్తాన్) .. ధుంకీ (మేరే బ్రదర్ కి దుల్హాన్).. పర్వా వంటి చార్ట్ బస్టర్ సాంగ్స్ పాడిన గాయనిగా తనకంటూ ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంది. బ్యాండ్ మేనేజ్ మెంట్ సమయంలో తన ఫ్యాటీ స్టమక్ ని చూస్తూ చాలా సిగ్గుపడేదానిని అని నేహా ఇప్పుడు మరోసారి గుర్తుచేసుకుంది. అందాన్ని కాపాడుకునేందుకు గాయణీమనులు కూడా చాలా చేయాలి. నిరంతరం జిమ్ యోగా అంటూ పెద్ద షెడ్యూల్ ని క్రమం తప్పకుండా పాటించాలి. అప్పుడు మాత్రమే టోన్డ్ ఫిజిక్ ని మెయింటెయిన్ చేయగలరు. చాలా ఏళ్లుగా శ్రమించి నేహాభాసిన్ తన రూపాన్ని ఇప్పటికి మార్చుకోగలిగింది. మునుపటిలా బాన పొట్టతో కనిపించడం లేదు. పూర్తిగా టోన్డ్ ఫ్లాట్ స్టమక్ తో కనిపిస్తోంది. ఫిట్ బాడీతో గుబులు పుట్టిస్తోంది. ఇక తాజా ఇంటర్వ్యూలో నేహా కొన్ని సంచలన విషయాలను వెల్లడించింది. సరైన ఆకృతిలో నా పొట్ట లేనందున నేను అంతర్జాతీయ పాప్ స్టార్ ని కాలేనని అనుకునేదానిని అంటూ తన నిరాశ గురించి వెల్లడించింది. ఒకప్పుడు నేహా భాసిన్ పొట్టను చూసి వెక్కిరించేవారట. ఆమె కెరీర్ ప్రారంభ దశలో వెక్కిరింతలు.. అనుచిత వ్యాఖ్యల కారణంగా తాను చాలా మారానని తెలిపింది. బొద్దుతనం వల్ల అనారోగ్యం కూడా వెంటాడేదని వెల్లడించింది. ఇప్పుడు అద్భుతమైన రూపంతో ఆరోగ్యంగా ఉన్నందుకు సంతోషంగా ఉంది. అంతేకాదు తన శరీరాన్ని ఇలా మార్చుకోవడానికి లేదా మలుచుకోవడానికి ఏకంగా ఆమెకు ఒక దశాబ్దం పట్టిందట. నేను 2002లో %ఎ×వాూ%తో నా కెరీర్ ని ప్రారంభించినప్పుడు ముఖ్యంగా మేనేజ్ మెంట్ లో చాలా బాడీ షేమింగ్ ఎదుర్కొన్నాను. ఆ తరువాత నేను 10 సంవత్సరాలు నా బరువు సమస్యల వల్ల చాలా అనారోగ్యం ఎదుర్కొన్నాను. నా శరీరాన్ని రూపాన్ని అంగీకరించేందుకు నిరంతరం పోరాడాను. నా మనసులో ఇవన్నీ పాతుకుపోయాయి" అని నేహా భాసిన్ చెప్పారు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com